కవితా కౌముది

# కవులేం చేస్తారంటే

అల్లూరి గౌరీలక్ష్మి

తమ సున్నితత్వానికీ, భావుకత్వానికీ
లోకపు లోహ తత్వానికీ జోడీ కుదరక
సమూహంలో తమను తాము ఇముడ్చుకోలేక
ప్రకృతి కడుపులోకి పారిపోయి దాక్కుంటారు

చెట్ల ఆకుల కొమ్మలతో, ఆకాశపు పక్షులతో
మబ్బులతో, మెరుపులతో, వర్షపు చినుకులతో
మమేకమై, ఆనక  జట్టు కట్టి మైమరచిపోతారు
ఆపై తమను తామే చేరుకుని వికసనం చెందుతారు

బయలుదేరిన చోటికొచ్చి తిరుగు బావుటా ఎగరేస్తారు
ఎవరితో పోరాడాలో ఖచ్చితంగా తేల్చుకుంటారు
ఆయుధాలుగా తమ కలాల్ని మలుచుకుంటారు
సాహస యుద్ధానికి సమర శంఖం ఊదుతారు

సహజీవుల చీకటి చెరల విముక్తికై నడుంకడతారు
అసమానతలు ఎత్తి చూపి అన్యాయం ఎదుర్కునే దారితీస్తారు
జనులకి కవితా ప్రమిదల్లో ఆత్మవిశ్వాసపు చమురు నింపి
జనతకై తామే వత్తులుగా మండుతూ వెలుగుబాట చూపుతారు.



# సమాంతర రేఖలు
## వాసుదేవమూర్తి శ్రీపతి

మనం ఎప్పటికి కలవని
సమాంతర రేఖలం అయితేనేం
నే కన్నుమూసే వరకూ
నువ్వు నా కళ్ళలోనే ఉంటావుగా
అది చాలు ఈ జన్మకి

ఎప్పటికీ కురవని మేఘంలా నువ్వు
ఎప్పటికైనా కురవకపోతావా
అనే ఆశతో నేను
మనం కలిసినా కలహించినా
తనకి ఒరిగేదేంలేదంటూ
కరిగిపోయే కాలం

ఇప్పుడు సమాంతర రేఖలు మూడు
కరగని నువ్వు
ఆశ కరగని నేను
కరగడం తప్ప మరేమీ తెలియని కాలం

నీమనసు కరిగినా కరగకపోయినా
నా ఆశ తీరినా తీరకపోయినా
మనం కలిసినా కలవకపోయినా
కాలంతోపాటు మన వయసు
కరిగిపోతూనే ఉంటుంది

ఏదోనాటికి మన శరీరాలు మన్నులో
మన జ్ఞాపకాలు కాలంలోనూ కలిసిపోతాయి
నీలో కలవడంకన్నా నాకున్న పెద్ద ఆశ ఏంటంటే
నీకన్నా ముందు మన్నులో కలిసిపోవడం
కొంత కాలమైనా నీ జ్ఞాపకంగా మిగిలిపోవడం.

★★★

# ఏం తెలుసని?
## బాలాజీ పంజా

ఏం తెలుసని కథ మలుపులు ముందు మాటకి
ఏం తెలుసని ఎద తలపులు కంటి చూపుకి !
తిరిగే భూమికి తెలియని రోజులు ఎన్నో
వెలిగే వెలుగుకు తెలియని చీకటి ఎంతో ,
నది మొదలుకి తెలియదు దాగిన మలుపులు ఎన్నో
ఏ మలుపుకు తెలియదు తుది గమ్యం ఏంటో ,
చూసిందేదో  చూపించేసే
అద్దం ఎరుగదు చూసే అందం,
వెతికేదేంటో ఎవరికి తెలుసు
తీరని లోటు తీరే వరకు,
తెలియనిదేంటో ఎవరికి తెలుసు
ఆ తెలియనిదేంటో తెలిసే వరకు,
తెలిసే వరకు ఎవరికి తెలుసు
అప్పటివరకు తెలియనిదేంటో ,
ఏ దూరానికి దారులు తెలుసు
ఏ దారికి తీరం తెలుసు ,
బదులేంటో ఏ ప్రశ్నకి తెలుసు
మొదలేంటో ఏ కొమ్మకి తెలుసు ,
కదిలే మేఘం నదికేం తెలుసు
నీరై జారి చేరే వరకు,
రేపటి తళుకులు మనకేం తెలుసు
చీకటి దాటి చేరే వరకు  ,
తెలిసినదంతా స్మృతియై గతము
ఆ తెలియనిదంతా జీవితము
తెలియనితనమే జీవితము.!!

★★★

# స్పష్టాస్పష్టత

రవికిషోర్ పెంట్రాల

పరిచిన దారుల్లో
తెలిపిన త్రోవల్లో
మీ పయనాలు
బహు వేగం!
ముందుకు సాగే
మార్గమే లేక
మా గమనాలు
అతి భారం!
స్పష్టమైన దారుల్లో
కోరుకున్న గమ్యంవైపు
క్షణం ఆలోచించక
దూసుకెళ్తారు మీరు!
అస్పష్టమైన మార్గాన
గుంతలు పూడుస్తూ
ఊబులు తప్పుకుంటూ
జాగ్రత్తగా నడుస్తాం మేము!
ఆలోచన్లకి అవకాశంలేక
మీ మెదళ్ళు మొద్దుబారతాయ్
ఎపుడూ అప్రమత్తమై
మా మెదళ్ళు రాటుదేలుతాయ్!
గుడ్డిగ నమ్మిన మార్గం
గతి తప్పుతుందనిపిస్తే
తత్తరపడ్తారు అనుమానిస్తారు
వేగం తగ్గుతుంది మీకు!
మేమేర్పరుచుకున్న మార్గం
నడిచి తిరిగిన మార్గం
ఆత్మస్థైర్యంతో నడుస్తాం
త్వరణం హెచ్చుతుంది మాకు!

★★★

# రసరేఖలు

**శ్రీధర్ బచ్చోటి**

ఇది విచిత్రసీమ యిచటనేమి లేదు
శూన్యమనునట్లు తోచునేచోటనైన
నేల వాయువు తేజస్సు నీరు కూడ
కంటికేదియు నిచ్చట కానరాదు

ఎటుల వచ్చితిమిచ్చటకెరుగలేము
తిరిగి పోవుట యెట్టులో తెలియలేము
ఇది పదార్థరహిత సీమ, ఇదె యనంత
విశ్వమిచ్చటే మన స్థితి శాశ్వతమ్ము

ఇచట మన శరీరమ్ములదృశ్యమైన
మనసులివి యేమి స్పష్టమై తనరుచుండె
ఊహకందినదే యీ యనూహ్యసీమ
సాధ్యమౌనేమొ యూహలు సాగుటిచట

ఎవరు చూడని రాలేనిదీ ప్రదేశ
మిచటకెట్టుల వచ్చితిమీవు నేను
అరుగుదెంచెదరిటకేమొ యందరిట్లు
ఐన వారిని గాకేమి యరయరేమొ

అరయుటన్నచోనయ్యది యాత్మ యందె
ఆత్మ యెరుగును తనకనుగైన యాత్మ
ద్వయము కామిక మనమేకతయె స్థిరమ్ము
పరమసిద్ధి యిది యిదె నిర్వాణమన్న


చిత్రం:కె.రామ్మోహన్

COMMENTS